# ప్రణాళికలు... మౌలిక రంగ పెట్టుబడులు

**మౌలిక రంగం.. ఓ దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రగతికి ఎంతో కీలకమైన విభాగం. ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దీని పాత్ర మరింత ప్రధానం. ప్రస్తుతం మన ఆర్థికవృద్ధి మందగించిన నేపథ్యంలో.. అధిక వృద్ధివైపు పయనించడానికి మౌలిక రంగ పెట్టుబడుల్ని పెంచాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ క్రమంలోనే ఈ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు 2009-10 బడ్జెట్ ద్వారా ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయాలను ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రణాళికా యుగంలో మౌలిక రంగ పెట్టుబడులపై విశ్లేషణ...**

ప్రపంచంలోని అనేక దేశాలకంటే ఇటీవల భారత్ ఆర్థిక ప్రగతి సాధనలో ముందుంటున్నా.. విద్య, ఆరోగ్య సూచికలకు సంబంధించి స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అసమానతలు పెరుగుతున్నాయి. వీటిని రూపుమాపి అందరికీ గృహవసతి, శుభ్రమైన తాగునీరు, విద్యుచ్ఛక్తి, టెలిఫోన్ సౌకర్యం, గ్రామాలన్నిటికీ రహదారుల సౌకర్యం కల్పించే భారత్ నిర్మాణ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశీయంగా మౌలిక రంగ పెట్టుబడుల్లో ఇతర రాష్ట్రాలకంటే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని క్రిసిల్ నివేదిక అభిప్రాయం. ఇక స్వాతంత్ర్యం తర్వాత ప్రణాళికా యుగంలో.. అధిక వృద్ధి సాధించే దేశంగా భారత్ రూపొందడానికి టెలికమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలు దోహదపడ్డాయి. దీంతోపాటు విద్య, శిక్షణ విభాగాల్లో అధిక పెట్టుబడులు నమోదయ్యాయి. తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి ఆటోమొబైల్, రిటైల్ బ్యాంకింగ్, ఇతర వినియోగ వస్తు సేవలకు స్వదేశీ డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో భారత్‌లో ప్రైవేటు రంగ పాత్ర అభినందనీయం. దేశం సాధించిన అధిక వృద్ధి పేదరికం తగ్గుదలకు కూడా ఊత మిచ్చింది.

### ఏడీబీ చేయూత:

ఒక దేశం వేగంగా అభివృద్ధి చెందడానికి, పేదలకు ముఖ్య సేవలను అందించడానికి మౌలిక సౌకర్యాలు ఉపకరిస్తాయనేది నిస్సందేహం. ఆసియా ఖండంలోని ఇతర దేశాల మాదిరిగానే మౌలిక సౌకర్యాల కల్పనలో భారత్ భారీ సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో.. ఆసియా అభివృద్ధి బ్యాంక్(ఏడీబీ) ఎంతో చేయూతనిచ్చింది. 2006-2008 సంవత్సరాల మధ్య రవాణా, పట్టణాభివృద్ధి, శక్తి రంగంలో అభివృద్ధికి ఏడీబీ తోడ్పాటునందించింది. ఈ క్రమంలో పట్టణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధిలో భాగంగా తాగునీరు, పారిశుధ్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యతనిచ్చారు. శక్తి రంగానికి సంబంధించి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా నేషనల్ ట్రాన్స్‌మిషన్ గ్రిడ్ మెరుగుపరచడానికి, హైడ్రో పవర్ సామర్థ్యం పెంచడానికి ఏడీబీ తోడ్పడింది. రవాణా రంగ అభివృద్ధిలో భాగంగా నేషనల్ హైవే డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొదటి రెండు దశలకు ఏడీబీ ఆర్థిక సహాయం అందించింది.

### మౌలిక సౌకర్యాల రంగంలో పెట్టుబడుల ఆవశ్యకత:

## రవాణా, సమాచార రంగం:

దేశంలో రవాణా, సమాచార రంగం మార్పు దిశగా పయనిస్తోంది. ఆధునిక సమాచార రంగంలో విస్తరణ జరుగుతోంది. మారుమూల గ్రామాల్లోని వారు సైతం ప్రపంచంలోని ఎక్కడికైనా, ఎవరితోనైనా టెలిఫోన్ ద్వారా సంభాషించడానికి అవకాశం ఏర్పడింది. సెల్యులర్ మొబైల్ ఫోన్‌లు, గ్రామీణ పబ్లిక్ కాల్ ఆఫీసులు, టెలీ సాంద్రత (Teledensity) విస్తరణ ఈ రంగ అభివృద్ధికి సూచికలు. మరోవైపు రవాణా రంగం ఇంకా అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉంది. జాతీయ (నేషనల్), రాష్ట్ర హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేల ఆధునికీకరణ, విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

## వ్యవసాయ రంగం:

ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రారంభమయ్యే నీటిపారుదల ప్రాజెక్టుల్లో స్తబ్ధత నెలకొంది. రాష్ట్రాలు... చిన్న, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల్ని ప్రాధాన్యతాంశాలుగా చేపట్టడం లేదు. సబ్సిడీతో కూడుకొన్న ప్రైవేటు నీటిపారుదలపైకే అందరి దృష్టి మళ్లింది. కాల్వలు, ట్యాంకుల ద్వారా నీటిపారుదల సౌకర్యం కల్పించడానికి బదులు.. పంపుసెట్ల వ్యవస్థవైపు మళ్లడం.. నీటిపారుదల సేవల నుంచి ప్రభుత్వం వైదొలుగుతున్నట్లుగా తెలుస్తుంది. దీంతో పంపుసెట్లకు అయ్యే మూలధన వ్యయాన్ని భరించలేని చిన్న, మధ్య తరహా రైతులకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. సమీప భవిష్యత్తులో ఈ పరిస్థితి దేశంలో అసమానతలకు దారి తీయగలదు.

## విద్యుత్ రంగం:

విద్యుత్ లభ్యత, సామర్థ్యం పెంపుదల పట్టణ ప్రాంతాల్లో మెరుగుపడినా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యుత్ కొరత కొనసాగుతోంది. సంస్కరణల యుగంలో అనేక రాష్ట్రాలు విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాయి. అయినా.. పలు రాష్ట్రాల్లోని విద్యుత్‌బోర్డులు నష్టాలతో నడుస్తున్నాయి. ముఖ్యంగా ట్రాన్స్‌మిషన్, పంపిణీ నష్టాలు పెరుగుతున్నాయి.

## విద్యా రంగం:

పాఠశాలలు, కళాశాలల ఏర్పాటు పెరుగుతున్న నేపథ్యంలో.. భౌతికంగా విద్యా రంగంలో మౌలిక సౌకర్యాల పెరుగుదల జరిగిందని భావించవచ్చు. ఉన్నత విద్యా వ్యవస్థలో వృద్ధిరేటు పెరిగింది. మరోవైపు ప్రాథమిక విద్యకు నిధుల కొరత ఏర్పడింది. ప్రాథమిక పాఠశాలలకు శాశ్వత నిర్మాణాలు జరగలేదు. విద్యార్థుల సంఖ్యతో పోల్చినపుడు శిక్షణ పొందిన ఉపాధ్యాయుల లభ్యత కూడా తక్కువే. ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్య ఎంతో సబ్సిడీతో కూడుకొందిగా మారింది. ఓవైపు ప్రపంచం గుర్తించే స్థాయిలో గ్రాడ్యుయేట్లు, శిక్షణ పొందిన Scientific Personnels మన దేశంలో ఉండగా.. ఎక్కువ నిరక్షరాస్యత కలిగిన దేశంగా కూడా భారత్ రూపొందింది. ఇలా సామర్థ్యంలోని అసమా నతలు కూడా అభివద్ధి ప్రక్రియకు అవరోధంగా తయారయ్యాయి. మౌలిక రంగాలన్నీ వనరుల లభ్యత, ఫైనాన్సింగ్

లాంటి ఒకే విధమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఎక్కువ లాభదాయకత లేనందువల్ల ఈరంగం ప్రైవేటు పెట్టుబడులను ఎక్కువ ఆకర్షించలేకపోయింది. అధిక డిమాండ్, అసమర్థత కూడుకొన్న సేవలు, మౌలికరంగంలో టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేయకపోవడం, యాజమాన్య వైఫల్యం లాంటి సమస్యలు పెరుగుతున్నాయి.

### ప్రణాళికా పరంగా మౌలిక రంగ పెట్టుబడులు:

స్వాతంత్ర్యం తర్వాత కాలంలో మౌలిక సౌకర్యాల కల్పనలో పెట్టుబడులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రణాళికా వ్యయాలు, వాస్తవ వ్యయంలో మౌలిక రంగానికి ప్రాధాన్యం లభించింది. మొత్తం ప్రణాళికా వ్యయంలో మౌలిక రంగంపై పెట్టిన పెట్టుబడులు మొదటి ప్రణాళికలో 80 శాతం. కాగా రెండు, మూడు ప్రణాళికల్లో 64 శాతానికి తగ్గింది. వార్షిక ప్రణాళికల్లో 58 శాతం ఉన్న పెట్టుబడి 4, 5వ ప్రణాళికల్లో 64 శాతానికి పెరిగింది. కానీ.. తర్వాత కాలంలో వార్షిక ప్రణాళికలో 62 శాతానికి, ఆరో ప్రణాళికలో 57 శాతానికి తగ్గింది. ఇక.. ఏడో ప్రణాళిక నుంచి మౌలిక రంగ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని చెప్పొచ్చు. ఏడో ప్రణాళికలో 58 శాతం, 8వ ప్రణాళికలో 62 శాతం, 9వ ప్రణాళికలో 70 శాతం, పదో ప్రణాళికలో 67.4 శాతం మౌలిక రంగంపై పెట్టుబడులుగా మరల్చారు. మొత్తం ప్రణాళికా యుగంలో (1951-2007) మొత్తం ప్రణాళికల వ్యయం రూ. 33,95,483 కోట్లు. కాగా.. 66 శాతం అంటే రూ. 22,45,291 కోట్లు మౌలిక రంగంలో పెట్టుబడులకే కేటాయించారు. ఈ పెట్టుబడుల్లో రవాణా, సమాచార రంగాలు ప్రథమ స్థానంలో, విద్యుచ్ఛక్తి రంగం ద్వితీయ స్థానంలో నిలిచాయి. మౌలికరంగ పెట్టుబడులు పెరిగినా మౌలిక సౌకర్యాల లభ్యతలో ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగి ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధికి విఘాతం కలగడం గమనార్హం.

### 2009-10 బడ్జెట్:

2009-10 బడ్జెట్ ద్వారా ప్రభుత్వం అనేక సాంఘిక, అవస్థాపనా రంగాల్లో ప్రోత్సాహకాలు ప్రకటించింది. దీనివల్ల 2009-10 సంవత్సరాల్లో డిమాండ్ పెరుగుదలకు ప్రభుత్వ వ్యయం ఒక సాధనంగా ఉపయోగపడే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల 15 శాతం ఉండగలదు. స్థూల స్థిర మూలధన సంచయనం వృద్ధి 2008-09లో 8.2 శాతం. కాగా అది 2009-10లో 3 శాతం ఉంటుందని బడ్జెట్ అంచనా. మూలధన సంచయన వృద్ధిరేటు తగ్గుదల పెట్టుబడి రేటు వృద్ధిలో తగ్గుదలను సూచిస్తుంది. ప్రైవేటు వినియోగ వృద్ధి 2008-09లో 2.8 శాతం. కాగా, 2009-10లో 5.5 శాతం ఉండగలదని అంచనా.

మౌలిక మొత్తం మొత్తంసాకర్యాలపై ప్రణాళిక వ్యయంలో

ప్రణాళికా కాలంవ్యయంవ్యయం మౌలిక

(రూ. (రూ. సౌకర్యాలపై

కోట్లలో)కోట్లలో)వ్యయం
(శాతంలో)

మొదటి ప్రణాళిక1574196080.3
(1951–56)
రెండో ప్రణాళిక
(1956–61) 2998 4672 64.2
మూడో ప్రణాళిక 5522857764.4
(1961–66)
వార్షిక ప్రణాళికలు 3882 6625 58.6
(1966–69)
నాల్గో ప్రణాళిక 100541577963.7
(1969–74)
ఐదో ప్రణాళిక 249803942663.4
(1974–79)
వార్షిక ప్రణాళిక 75411217761.9
(1979–80)
ఆరో ప్రణాళిక 6281410929257.5
(1980–85)
ఏడో ప్రణాళిక 12741821873058.3
(1985–90)
వార్షిక ప్రణాళిక 7796712312063.3
(1990–92)
ఎనిమిదో ప్రణాళిక 298468485455 61.5
(1992–97)
తొమ్మిదో ప్రణాళిక 594367844031 70.4
(1997–2002)
పదో ప్రణాళిక 10277061525639 67.4
(2002–2007)
మొత్తం ప్రణాళికలు 22452913395483 66.1
(1951–2007)

ఆధారం: ఇండియా ఎకానమీ రివ్యూ, సెప్టెంబర్ 2008, P.No. 285–286.